కాంగ్రెస్, బీజేపీ వాళ్లది పూటకో మాట

హుజూరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి


గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్‌రూరల్/జమ్మికుంట/వీణవంక: వీణవంక మండలంలోని చల్లూరును మండలంగా చేస్తానని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని, అదేవిధంగా గ్రామాన్ని దత్తత తీసుకుంటానని జమ్మికుంటలో జరిగిన సభలో చెప్పారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. చల్లూరు, దేశాయిపల్లి గ్రామాలలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే చల్లూరును మండలంగా చేసే బాధ్యత నాదేనని ప్రకటించారు. 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తుంది తెలంగాణ రాష్ట్రమేనని, కాంగ్రెస్, బీజేపీ వాళ్లు పూటకో మాట మాట్లాడుతున్నారని విమర్శించారు. సంక్షేమ పథకాల అమలు సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమైందని, రా బోయేది మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమేనని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వాల బాలకిషన్‌రావు, మునిపట్ల తిరుపతిరెడ్డి, జక్కు నారాయణ, బొంగోని రాజయ్య, తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

హుజూరాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు గొస్కుల చందు బీజేపీకి నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా పాడి కౌశిక్‌రెడ్డి గులాబీ కుండవాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, సీనియర్ నాయకులు ప్రభాకర్, రవీందర్‌రావు, తొగరు భిక్షపతి, మండలాధ్యక్షుడు సంగెం ఐలయ్య తదితరులు ఉన్నారు.

గడప గడపకు నాయకుల ప్రచారం

జమ్మికుంట పట్టణంలోని 6, 8, 18, 20వ వార్డుల్లో బీఆర్ఎస్ శ్రేణులు పాడి కౌశిక్‌రెడ్డిని గెలిపించాలని గురువారం గడప గడపకు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను తెలుపుతూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు.


జమ్మికుంటలో ప్రచారం చేస్తున్న నాయకులు

కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, కౌన్సిలర్లు బొద్దుల అరుణరవీందర్, దేశిని రాధ సదానందం, ఆయా వార్డుల కమిటీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పదేళ్లుగా ప్రజలతోనే ఉంటున్నా..

- ప్రస్తుత ఎమ్మెల్యే సంపాదనపై దృష్టి పెట్టారు
- కాంగ్రెస్ చొప్పదండి అభ్యర్థి మేడిపల్లి సత్యం

గంగాధర: చొప్పదండి నియోజకవర్గం నుంచి రెండు సార్లు పోటీ చేసి ఓడినా పదేళ్లుగా ప్రజలతోనే ఉంటున్నాను, నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ప్రజలు, రైతాంగ సమస్యలపై పోరాటం చేస్తున్నానని కాంగ్రెస్ పార్టీ చొప్పదండి ఎమ్మెల్యే అభ్యర్థి మేడిపల్లి సత్యం అన్నారు. మూడోసారి పోటీ చేస్తున్న మేడిపల్లి గురువారం సాక్షితో మాట్లాడారు. రాష్ట్రంలో, నియోజకవర్గంలో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారని, ప్రస్తుత ఎమ్మెల్యే ప్రజాసమస్యలకంటే సంపాదనపై ఎక్కువ దృష్టి పెట్టారని, 30న జరిగే ఎన్నికల్లో నియోజకవర్గంలోని ఓటర్లు భారీ మెజారిటీతో గెలిపించడానికి సిద్ధమయ్యారని పేర్కొన్నారు.

ప్రశ్న: ఎన్నికల ప్రచారం ఎలా ఉంది?

మేడిపల్లి: ఎన్నికల నోటిఫికేషన్ రాక ముందు నుంచే గడప గడపకు కాంగ్రెస్ పేరుతో ఊరూరా తిరిగాను. ఓడినా పది సంవత్సరాలుగా ప్రజలతోనే ఉంటున్నా. రెండు సార్లు ఓడిన తనకు ఈసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వడానికి ప్రజలు మొగ్గు చూపుతున్నారు. గతంలో గెలిచి ప్రజలను విస్మరించిన బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులకు గుణపాఠం చెబుతారు.



ప్రశ్న: కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారా?

మేడిపల్లి: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రచార సమావేశాల్లో వివరిస్తున్నాం. పార్టీ కార్యకర్తలు, నాయకులు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి చెబుతున్నారు. బీఆర్ఎస్ పాలనపై ప్రజలకు విశ్వాసం లేకుండా పోయింది.

ప్రశ్న:నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ఆదరణ ఎలా ఉంది?

మేడిపల్లి: ఆరు గ్యారంటీ పథకాలతో కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో ఆదరణ పెరిగింది. ఇతర పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారు. పాత, కొత్త నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారం చేస్తున్నాం.

ప్రశ్న: బీఆర్ఎస్, బీజేపీ నాయకుల దుష్ప్రచారాలను ఎలా తిప్పి కొడుతున్నారు?

మేడిపల్లి: ఓడిపోతున్నామనే ఫ్రస్టేషన్‌లో ప్రత్యర్థులు కాంగ్రెస్‌పై అసత్యపు ఆరోపణలు చేస్తున్నారు. మాతో ప్రాణభయముందని, గెలిచాక పార్టీ మారుతామని చేస్తున్న ప్రచారాల్లో నిజం లేదు.

ప్రశ్న: ఎమ్మెల్యేగా గెలిస్తే నియోజకవర్గంలో మీరు చేసే అభివృద్ధి ఏమిటి?

మేడిపల్లి: ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత నారాయణపూర్ భూ నిర్వాసితులకు న్యాయం జరిగేలా చేయడంతో పాటు కుడి, ఎడమ కాలువల పనులు పూర్తి చేయిస్తాను. నారాయణపూర్, మంగపేట, చర్లపల్లి, ఇస్తార్‌పల్లి గ్రామాలను ముంపు గ్రామాలుగా ప్రకటింప చేయడంతోపాటు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తాను. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి ప్రయత్నిస్తాను.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే



టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న ఎంపీపీ లింగాల మల్లారెడ్డి, నుస్తులాపూర్ సొసైటీ మాజీ చైర్మన్ అలువాల కోటి

గన్నేరువరం: వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని కాంగ్రెస్‌లో చేరిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు అన్నారు. గన్నేరువరం మండల పరిషత్ అధ్యక్షుడు లింగాల మల్లారెడ్డి, నుస్తులాపూర్ సహకార సంఘం మాజీ చైర్మన్, ఉద్యమ నాయకుడు అలువాల కోటీ, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు కట్టా కొమురయ్య గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన అనంతరం తిమ్మాపూర్ మండలం రేణికుంట టోల్‌ప్లాజా వద్ద నిర్వహించిన బహిరంగ సభలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలువాల కోటీ 2001 నుంచి ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. అదే సమయంలో ఓ కార్యక్రమానికి వెళ్లే క్రమంలో జరిగిన ప్రమాదంలో సగం పాదం కోల్పోయారు. వీరితో పాటు మరికొందరు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మానకొండూర్ ఎమ్మెల్యే అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ, కవ్వంపల్లి అనురాధ, యువజన కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్కూరి అనంతరెడ్డి, జిల్లా కార్యదర్శి బొడ్డు సునిల్, జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్మెర రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమం చూసే బీఆర్ఎస్‌లో చేరికలు


పార్టీలో చేరిన వారితో సతీశ్‌కుమార్


సతీశ్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న డాక్టర్ మాధవి, మహిళలు

- హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి సతీశ్‌కుమార్

హుస్నాబాద్: పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి సతీశ్‌కుమార్ సమక్షంలో వివిధ గ్రామాలకు చెందిన నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఏబీవీపీ నాయకుడు శివకుమార్‌తో పాటు 50 మంది, ఆరపల్లెకు చెందిన 30 మంది, పొట్లపల్లికి చెందిన 30 మంది, అక్కన్నపేట మండలం మోత్కులపల్లి గౌడ సంఘం అధ్యక్షుడు, 25 మంది పాలకవర్గ సభ్యులు, చౌటపల్లికి చెందిన కాంగ్రెస్, బీజేపీలకు చెందిన 30 మంది కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి సతీశ్‌కుమార్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసే నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని పేర్కొన్నారు.

బీఆర్ఎస్‌ను ఆశీర్వదించండి..

హుస్నాబాద్/కోహెడ(హుస్నాబాద్): బీఆర్ఎస్ అభ్యర్థి సతీశ్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ సతీమణి డాక్టర్ మాధవి గురువారం పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మహిళలకు బొట్టు పెట్టి కారు గుర్తు కు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు సుప్రజ, రమాదేవి పాల్గొన్నారు. అలాగే కోహెడ మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు సతీశ్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కోహెడ ఫ్యాక్స్ చైర్మన్ పేర్యాల దేవేందర్‌రావు, సుకుమార్, వెంకటస్వామి, శంకర్, నాగరాజు, జగదీశ్, నర్సయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దు

హుస్నాబాద్: ప్రతిపక్షాల మాటలు నమ్మవద్దని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధులు నేషనల్ లేబర్ కో ఆపరేటివ్ డైరెక్టర్ దండుడల రాజ్యలక్ష్మి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లింగాల సాయన్న, సర్పంచ్ గద్దల సంపత్ అన్నారు. పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం మాట్లాడారు. తెలంగాణలో సంక్షేమ పథకాలు కొనసాగాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించుకోవాలని సూచించారు.

6 గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

- హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలని హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో భీమదేవరపల్లి సర్పంచ్ సాతూరి స్వాతి, వార్డు సభ్యులు గురువారం కాంగ్రెస్‌లో చేరగా వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధుల చేరికలు ఉంటాయని తెలిపారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి అమలు చేయలేదని మండిపడ్డారు.

మా మద్దతు పొన్నంకే..

అక్కన్నపేట(హుస్నాబాద్): పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు మా మద్దతు ఉంటుందని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెప్యాల ప్రకాశ్ ప్రకటించారు. మండలంలోని కట్కూర్‌లో గురువారం తెలంగాణ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో దళితులకు చేసింది ఏమీ లేదన్నారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.


హుస్నాబాద్: సర్పంచ్ స్వాతిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న పొన్నం ప్రభాకర్

భారీ మెజార్టీతో గెలిపించాలి

ఎల్కతుర్తి: పొన్నం ప్రభాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ కోరారు. భీమదేవరపల్లి మండలం కొత్తకొండలో గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అనంతరం మండలంలోని చింతలపల్లిలో కాంగ్రెస్ యూత్ ప్రెసిడెంట్ హింగె శ్రీకాంత్ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి, మాజీ అధ్యక్షుడు సుకినె సంతాజీ, నాయకులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

ఉత్సవమూర్తులకు అలంకారం

కరీంనగర్‌కల్చరల్: కట్టారాంపూర్ అభయాంజనేయస్వామి దేవాలయంలో జరుగుతున్న తృతీయ వార్షికోత్సవంలో భాగంగా గురువారం ఆలయంలో దుర్గామాతతో పాటు సీతారామచంద్రస్వామి ఉత్సవమూర్తులకు స్నపనం, అలంకారం వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో నాగారపు శ్రీనివాస్, అర్చకులు కొమ్మెర రవిశర్మ, తాడూరి సుగుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జనవరి 8వ తేదీ వరకు అయ్యప్ప ఆలయంలో భిక్ష

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని భగత్‌నగర్ జెడ్పీ క్వార్టర్స్ ఆవరణలోని అయ్యప్ప దేవాలయంలో శుక్రవారం నుంచి జనవరి 8 వరకు ఉదయం తేనీరు, మధ్యాహ్నం భిక్ష, రాత్రి అల్పాహారం ఆలయం పక్షాన దాతలు, భక్తులు సహాయంతో నిర్వహిస్తున్నట్లు ఈవో కొన్న కాంతారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విరాళాలందించే దాతలు, భక్తులు ఆలయంలోని అర్చక, సిబ్బందిని సంప్రదించి రశీదు తప్పనిసరి పొందాలని కోరారు.

నా కొడుకు జీవితం మీ చేతుల్లో పెడుతున్నా..

- విజయభేరి సభలో ఆకట్టుకున్న ప్రణవ్ తల్లి పద్మశ్రీ ప్రసంగం

జమ్మికుంట: 'అమెరికాలో చదువుకొని, ఉద్యోగం చేస్తున్నా తృప్తి లేదు, రాజకీయం ద్వారా ప్రజలకు సేవ చేయాలనుందని పదే పదే నాతో చెప్పాడు, ఒక్కగానొక్క కొడుకు జీవితం మీ చేతుల్లో పెడుతున్నాను' అంటూ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితెల ప్రణవ్ తల్లి పద్మశ్రీ గురువారం జమ్మికుంట కాంగ్రెస్ విజయభేరి బహిరంగ సభలో ప్రసంగించారు. ప్రణవ్‌కు ఒక్క అవకాశం ఇచ్చి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. వొడితెల రాజేశ్వర్‌రావు ఆశయాలు కొనసాగించేందుకు మద్దతు ఇవ్వాలని వేడుకున్నారు. ఎమ్మెల్యేగా గెలిపిస్తే హుజూరాబాద్ ప్రజల భవిష్యత్, సంక్షేమం బాధ్యతగా చూసుకుంటాడని, నాది హామీ అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి డైనమిక్ లీడరని, రాష్ట్ర ప్రజలకు ఆయనతో మంచి జరుగుతుందని, కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను అమలు చేస్తారని పేర్కొన్నారు. రాజకీయం తెలియదంటూనే పద్మశ్రీ ప్రసంగం ఆకట్టుకుంది.



మాట్లాడుతున్న పద్మశ్రీ

కాంగ్రెస్‌లో చేరిక

వీణవంక మండలంలోని పోతిరెడ్డిపల్లి సర్పంచ్ పంజాల అనూషసతీశ్ గౌడ్, ఎంపీటీసీ రాధారపు రాంచంద్రం బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. వొడితెల ప్రణవ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ ఎంపీపీ బొబ్బల మల్లమ్మప్రేమానందం, హిమ్మత్‌నగర్ మాజీ సర్పంచ్ మ్యాక వీరయ్య, బీజేపీ నాయకులు వావిలాల సత్యనారాయణ కాంగ్రెస్‌లో చేరిన అనంతరం మాట్లాడారు. బీఆర్ఎస్‌కు ఆధారణ తగ్గుతుందని, అధికారంలోకి రాబోయేది కాంగ్రెస్ పార్టీయేనని అన్నారు. పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేస్తామని ప్రకటించారు.

- మద్యం విక్రయించినందుకు నోటీసు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని పోతిరెడ్డిపేట గ్రామానికి చెందిన నందిపట్ల రాజేందర్ అక్రమంగా మద్యం విక్రయించినందుకు పోలీసులు గురువారం క్రమశిక్షణ నోటీసులు అందజేశారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు గ్రామాల్లో మద్యం విక్రయించొద్దని ఆదేశాలు ఉన్నాయని, తహసీల్దార్ ఎదుట సైతం బైండోవర్ చేసినా లెక్క చేయకుండా మద్యం విక్రయించాడని అందుకే నోటీసులు జారీ చేశామని సీఐ శ్రీనివాస్ తెలిపారు.

చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడొద్దు

- కరీంనగర్ రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు
- గోపాల్‌రావుపేటలో పోలీసులు, సాయుధ బలగాల కవాతు


కవాతును ప్రారంభిస్తున్న సీఐ రవీందర్

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేటలో గురువారం కరీంనగర్ రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు, చొప్పదండి సీఐ రవీందర్, ఎస్సై తోట తిరుపతి ఆధ్వర్యంలో సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ... ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని కోరారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న దృష్ట్యా చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసులకు పూర్తి స్థాయిలో సహకరించాలని ప్రజలను కోరారు.

ఇంటివద్దనే ఓటేశాం

- పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్న వృద్ధులు, దివ్యాంగులు
- మానకొండూర్ నియోజకవర్గ వ్యాప్తంగా 380 మంది దరఖాస్తు
- బుధ, గురువారాల్లో 342 మంది సద్వినియోగం
- పోలింగ్ కేంద్రాలకు వెళ్లే బాధ తప్పిందని హర్షం

మానకొండూర్: ఓటుకు ఉన్న విలువ అంతా ఇంతకాదు. ఓటుహక్కును వినియోగించుకునేందుకు దూర ప్రాంతాలను సైతం లెక్క చేయకుండా వచ్చి ఓటేసి సంతోషం వ్యక్తం చేస్తుంటారు. ఓటు వేయకపోతే.. జనాభా లెక్కల్లో లేనట్టుగా భావించడం చూస్తుటాం. అయితే ఈసారి ఎన్నికల అధికారులు 80 ఏళ్ల దాటిన వృద్ధులు, దివ్యాంగులు, నిస్సహాయస్థితిలో ఉన్నవారు ఇంటి నుంచే ఓటేసేలా అవకాశం కల్పించడంతో చాలా మంది పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. మానకొండూర్ నియోజకవర్గ వ్యాప్తంగా 380 మంది దరఖాస్తు చేసుకోగా మొదటిరోజు బుధవారం 175 మంది ఓటుహక్కును ఇంటి వద్దే వినియోగించుకున్నారు. దివ్యాంగులు 68 మంది, 80 ఏళ్ల పైబడిన వృద్ధులు 107 మంది అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. గురువారం 167 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల అధికారులు నియోజకవర్గ వ్యాప్తంగా తొమ్మిది టీంలుగా ఏర్పడి దరఖాస్తు చేసుకున్న ఓటర్ల ఇళ్లకు వెళ్లారు. తొలిసారి ఇంటి నుంచే ఓటేశామని వృద్ధులు, దివ్యాంగులు ఎన్నికల అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.


ఖాదర్‌గూడెం గ్రామంలో ఓటరు ఇంటికి వెళ్తున్న ఎన్నికల సిబ్బంది, తదితరులు

ఇతరుల సాయం తప్పింది



దివ్యాంగురాలినైన నాకు ఓటు హక్కు వచ్చినప్పటి నుంచి ఇతరుల సహాయంతో పోలింగ్ కేంద్రానికి వెళ్లి అనేక ఇబ్బందుల మధ్య, బాధతో ఓటేశాను. ఇప్పుడు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఇంటి వద్దే ఓటుహక్కు వినియోగించుకున్న సంతోషంగా ఉంది. ఇతరులపై ఆధారపడటం తప్పింది.

– వరుకోలు లచ్చమ్మ, జంగపల్లి, గన్నేరువరం

ముందే ఓటేశాను



చిన్నప్పుడే నేను పోలియో బారినపడ్డాను. నాకు ఓటు హక్కు వచ్చిన నాటి నుంచి పోలింగ్ కేంద్రానికే వెళ్లి ఓటేసేవాడిని. ఈసారి మాత్రం ఇంటి వద్దే ఓటు వేసే అవకాశం వచ్చిందని తెలుసుకుని పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్నాను. ఇంటి వద్దే ఓటు వేయడం సంతోషంగా ఉంది.

– బాషబోయిన రాజ్‌కుమార్, చిగురుమామిడి

దివ్యాంగులకు మేలు



దివ్యాంగురాలినైనా నేను ఓటు హక్కు వినియోగించుకునేప్పుడు బాధలుపడ్డాను. అధికారులు దివ్యాంగుల కోసం ప్రత్యేక చర్యలు తీసుకునేవారు. ఈసారి వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దే ఓటేసే అవకాశం కల్పించినందుకు ఎన్నికల అధికారులకు కృతజ్ఞతలు.

– కట్ట కనుకవ్వ, ఖాసీంపేట, గన్నేరువరం

ఓటింగ్ శాతం పెరుగుతుంది



రోడ్డు ప్రమాదంలో కాలువిరిగింది. ప్రతిసారి పోలింగ్ కేంద్రంకు వెళ్లి ఓటేసి రావడం బాధాగా ఉండేది. కానీ ఈసారి మాత్రం ఎన్నికల అధికారులు ఇంటి వద్దే ఓటు వేసే అవకాశం కల్పించగా ఓటుహక్కును వినియోగించుకున్నా. పోస్టల్ బ్యాలెట్‌తో ఓటింగ్ శాతం పెరుగుతుంది.

– మడమడకల హన్మంతరెడ్డి, చిగురుమామిడి

పోస్టల్ బ్యాలెట్ లేకుంటే ఓటు వేసేదాన్ని కాదు



88 ఏళ్ల వయసులో పోలింగ్ బూత్‌కు వెళ్లి ఓటేసే ఓపిక లేదు. గతంలో ఆటోలో తీసుకువెళ్తే లైన్‌లో నిల్చొని ఓటేశాను. మాలాంటి వాళ్ల ఇంటికి వచ్చి ఎన్నికల అధికారులు ఓటు వేయించుకున్నారు. ఎన్నికల కమిషన్ ముసలివాళ్లకు ఈ అవకాశం కల్పించినందుకు సంతోషంగా ఉంది.

– కన్నం కనకమ్మ, వంకాయగూడెం, శంకరపట్నం